

చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 288 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.22

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది. మార్కెట్‌కు 360 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
37.5°/12.1°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం ఉండగా.. మధ్యాహ్నం ఎండలు పెరిగాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నియమావళి కచ్చితంగా పాటించాలి

- కలెక్టర్ బసంత్‌కుమార్



ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, జేసీ, ఆర్డీఓ

పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియమావళిని కచ్చితంగా పాటించాలని కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి పుట్టపర్తిలోని చిన్నపల్లి, ఎనుములపల్లి ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించారు. కేంద్రాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో 43,000 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు, 3,200 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 86 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

విధినిర్వహణలో అలసత్వం సహించం

రొద్దం: విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించబోమని కలెక్టర్ బసంత్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మండలంలోని చోళేమర్రి, చిన్నమంతూరు, నల్లూరు, కలిపి గ్రామ సచివాలయాలని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు పరిశీలించారు. చోళేమర్రి ఆర్‌బీకేలో ఎరువుల నిల్వ నిర్వహణ సరిగా లేకపోవడంతో హార్టికల్చర్ అధికారి దివ్యవాణిపై అగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ఉన్నారు.

చోరీ కేసుల్లో రికవరీ పెంచాలి: ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్

కొత్తచెరువు: చోరీ కేసులకు సంబంధించి రికవరీ పెంచాలని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశించారు. మంగళవారం ఆయన కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ రికార్డులను, లాకప్ గదులను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. అనంతరం సిబ్బంది పనితీరు, స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు...వాటి దర్యాప్తుపై సీఐ జయనాయక్‌ను ఆరా తీశారు. పెండింగ్ కేసుల్లో దర్యాప్తు ముమ్మరం చేయాలని, అక్రమ రవాణా నిరోధానికి నిఘా పెంచాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, విధి నిర్వహణ ఎవరైనా హద్దుదాటితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ వెంట డీఎస్పీ యశ్వంత్, ఎస్‌ఐ లింగన్న ఉన్నారు.



ఖల్ నాయక్

ఫోర్జరీ...భూకబ్జా..మోసం...పెళ్లిళ్ల పేరుతో అమ్మాయి బంధువుల నుంచి దండుకోవడం..ఓ తెలుగు తమ్ముడి ఆదాయ మార్గాలివి. ఇటీవల ధర్మవరానికి చెందిన ఓ అమ్మాయికి ఐఏఎస్ సంబంధమంటూ ముంబైకి చెందిన ఓ వ్యక్తితో పెళ్లి జరిపించాడు. కట్నం కింద రూ.కోటి కొట్టేశాడు. తీరా వరుడు ఐఏఎస్ కాదని తేలడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించగా...ఈ ఖల్ నాయక్ 'తమ్ముడి' బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

- పుట్టపర్తిలో కంత్రీ 'తమ్ముడు'
- కబ్జా..సెటిల్‌మెంట్లలో ఆరితేరిన శ్రీరామ్ నాయక్
- 'పల్లె'ను అడ్డం పెట్టుకుని యథేచ్ఛగా దందా
- ఐఏఎస్ సంబంధం తెస్తానని రూ.కోటి వసూలు
- వరుడు ఐఏఎస్ కాదని తేలడంతో స్టేషన్ మెట్లెక్కిన వధువు కుటుంబీకులు
- నెలరోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లి పోయిన 'పచ్చ' నేత



పెడపల్లిలో శ్రీరామ్‌నాయక్ నివాసం (ప్రహరీలో కలిసిపోయిన వాటర్ ట్యాంక్ స్థలం)

సాక్షి, పుట్టపర్తి: పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి తండాకు చెందిన శ్రీరామ్‌నాయక్ గతంలో ముంబైలో లేబర్ కాంట్రాక్టరుగా ఉండేవాడు. జిల్లా వాసులను ముంబై తీసుకెళ్లి నెలకు ఓసారి జీతం ఇచ్చేవాడు. అయితే జీతంలో కోతలు విధిస్తుండటంతో చాలామంది అతని వెంట వెళ్లడం మానేశారు. లేబర్ కాంట్రాక్టర్‌గా చలామణి అయిన శ్రీరామ్‌నాయక్ ముంబై మురికివాడల్లో స్థలాలు ఆక్రమించి.. రాత్రికి రాత్రే షెడ్లు కూడా వేసి.. కరెంటు బిల్లు తీసుకుని సొంత చేసుకునే వాడు. ఆ తర్వాత వాటిని విక్రయించేవాడు. ఈ వ్యాపారం లాభసాటిగా ఉండటంతో చాలా కాలం ఇదే దందా సాగించాడు. ఈ క్రమంలోనే అక్కడ ఓ హత్య కేసులో ఇరుక్కున్న శ్రీరామ్ నాయక్ ముంబై ఖాళీ చేసి స్వగ్రామం చేరుకున్నాడు.

సర్పంచ్‌గా ఉంటూ అధికారిపై దాడి

పుట్టపర్తి మండలం పెడపల్లి పంచాయతీ సర్పంచ్‌గా శ్రీరామ్‌నాయక్ 2006 – 2013 మధ్య కాలంలో పని చేశారు. ఆ సమయంలో విద్యుత్ శాఖ ఏఈగా పని చేసిన మహిళపై భౌతికదాడి చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయినా శ్రీరామ్‌నాయక్ పద్ధతి మార్చుకోలేదు. దందా ఆపలేదు. గతంలో పేద గిరిజనులకు ఇంటిపట్టాలిచ్చేందుకు పెడపల్లి పరిధిలో 5.75 ఎకరాలను కేటాయించగా, ఆ భూమిపై శ్రీరామ్ నాయక్ కన్నేశాడు. ఒకట్రెండు పట్టాలు పంపిణీ చేసి... అన్నీ తన వద్దే ఉంచుకుని ఇష్టం వచ్చిన వాళ్లకు విక్రయిస్తున్నాడు. పెడపల్లిలోని విలువైన భూములన్నీ సర్పంచ్‌గా ఉన్న సమయంలో స్వాహా చేసేశాడు.

నామినేషన్ తిరస్కరించినా...

సర్పంచ్‌గా అడ్డదిడ్డంగా సంపాదించిన శ్రీరామ్ నాయక్ తన భార్యను జెడ్పీటీసీగా నిలిపేందుకు శతవిధాలా ప్రయత్నించాడు. తనకు నలుగురు పిల్లలు కాగా, ఎన్నికల్లో పోటీకి భార్య అనర్హురాలవుతుందని 'కన్నింగ్' ప్లాన్ వేశాడు. ఓ ఇద్దరు పిల్లలు తన సంతానం కాదని గ్రేటర్ ముంబై కార్పొరేషన్ నుంచి తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకుని వచ్చి.. అఫిడవిట్‌లో పొందుపరిచాడు. పరిశీలనలో అదంతా తప్పు అని తేలడంతో... 2014 ఎన్నికల్లో శ్రీరామ్‌నాయక్ భార్య లక్ష్మీబాయి జెడ్పీటీసీ స్థానానికి వేసిన నామినేషన్‌ను అధికారులు రద్దు చేశారు. అయితే అప్పటికే డమ్మీగా నామినేషన్ వేసిన తన తమ్ముడి భార్య యశోదబాయిని స్వతంత్ర అభ్యర్థిగా నిలిపి గెలిపించుకున్నాడు. ఆమెను రాజకీయంగా అడ్డుపెట్టుకుని పల్లె రఘునాథరెడ్డికి దగ్గరయ్యాడు. టీడీపీ హయాంలో దందాలు, మోసాలు, కబ్జాల్లో ఆరితేరిపోయాడు.

ఫోర్జరీ సంతకాలతో బురిడీ

పెడపల్లితండాకు చెందిన మంగీబాయి, హేమ్లీబాయి, శ్రీనివాసనాయక్‌కు చెందిన ప్లాట్ల పత్రాలను ట్యాంపరింగ్ చేశాడు. వైట్‌నర్‌తో అసలు పేర్లు చెరిపేసి ఫోర్జరీ సంతకాలతో గొర్రెల కాపరి వెంకటరామనాయక్‌కు విక్రయించాడు. అయితే స్థలం మాత్రం ఇవ్వలేదు.. వెంకటరామనాయక్ తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా స్పందించలేదు. దీంతో అతను, బాధితులతో కలిసి ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ జరిపారు. అదంతా ప్రభుత్వ భూమి కావడంతో ఆ కేసులో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఇలా సుమారు 25 మందికి పట్టాల విషయంలో మోసం చేసినట్లు గ్రామస్తులు వివరించారు. అంతేకాకుండా 148 – 2 సర్వే నంబరులో 17 సెంట్ల ప్రభుత్వ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించేందుకు అగ్రిమెంట్లు కూడా సిద్ధం చేశాడు. అయితే అంతలోనే పోలీసులు అతన్ని రిమాండ్‌కు పంపడంతో ఆ ప్రక్రియ అక్కడితో ఆగిపోయింది.

నిబంధనల ఉల్లం'ఘనుడే'

మట్కా, గ్యాంబ్లింగ్, పేకాట, బెట్టింగ్‌లో శ్రీరామ్‌నాయక్ దిట్ట. ఇప్పటికే చాలాసార్లు పోలీసులకు పట్టుబడ్డాడు. అంతేకాకుండా పోలీసులకు నెల మామూళ్లు ఇస్తూ.. తండా పరిధిలో ఏకంగా 30 దుకాణాలు నిర్వహిస్తూ.. కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. శ్రీరామ్‌నాయక్ సోదరుడు గోవింద నాయక్ భార్య తండాకు మొత్తం మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. ఆమెను లిక్కర్ డాన్‌గా పిలుస్తారు. బస్టాండు సమీపంలో నీళ్ల ట్యాంక్‌ను కడితే.. ఇంటికి వాస్తు కోసం దాన్ని పడగొట్టి ప్రహరీ లోపలకు వేసుకున్నాడు.

పెళ్లి వ్యవహారంతో పరారీ

తన బంధువు ఒకరు ముంబైలో కలెక్టర్ ఉద్యోగం చేస్తున్నాడని చెప్పి.. ధర్మవరానికి చెందిన ఓ అమ్మాయిని అతనికిచ్చి వివాహం చేయించాడు. ఇందుకుగాను వధువు కుటుంబీకుల నుంచి రూ.కోటి దాకా కట్నం రూపంలో తీసుకున్నాడు. అయితే ఆ తర్వాత వరుడు ఐఏఎస్ కాదని తేలడంతో... ఇరు కుటుంబాలు చర్చించుకుని విడాకులకు సిద్ధమయ్యాయి. అయితే కట్నంగా ఇచ్చిన రూ.కోటి సొమ్మును నెల రోజుల్లో ఇస్తానని పోలీసుల సమక్షంలో ఒప్పుకున్న శ్రీరామ్‌నాయక్ ఆ తర్వాత పత్తా లేకుండా పోయాడు. ముంబయిలో ఉన్నట్లు బంధువులు చెబుతున్నా... బెంగళూరులో మకాం వేసినట్లు సమాచారం.

ఫిర్యాదు రాలేదు



శ్రీరామ్‌నాయక్‌కు సంబంధించి గతేడాది ఓ కేసు నమోదు చేశాం. రిమాండ్‌కు కూడా పంపాం. అంతకుముందు ఎన్నికల సమయంలో బైండోవర్ చేశాం. ఇటీవల ఓ కుటుంబ సమస్య మా వద్దకు వచ్చింది. ఇరువర్గాలూ మాట్లాడుకుని నెల రోజుల్లో డబ్బులు చెల్లించాలనే తీర్మానానికి వచ్చారు. అయితే శ్రీరామ్‌నాయక్ అదృశ్యమైన సంగతి మాకు తెలీదు. బాధితులెవరూ అతనిపై మాకు ఫిర్యాదు చేయలేదు.

– జె.జయ నాయక్, సీఐ, పుట్టపర్తి రూరల్

థ్యాంక్యూ జగనన్నా

- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్సీ అభ్యర్థి సానిపల్లి మంగమ్మ
- నేడు అట్టహాసంగా నామినేషన్ దాఖలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సానిపల్లి మంగమ్మ, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్, మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సానిపల్లి మంగమ్మ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆమె.. మంత్రి ఉషశ్రీచరణ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకుడు పొగాకు రామచంద్రతో కలసి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఆమెను సోదర ప్రేమతో ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...వాల్మీకులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. వైఎస్సార్ సీపీ అభివృద్ధికి అహర్నిశలూ శ్రమిస్తామన్నారు.

నేడు అనంతపురంలో నామినేషన్

పశ్చిమ రాయలసీమ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున సానిపల్లి మంగమ్మ బుధవారం నామినేషన్ వేయనున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డితో కలిసి ఉదయం 9 గంటలకు అనంతపురంలోని సంగమేష్ ఫంక్షన్ హాలు నుంచి వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌లో నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ ముఖ్య నాయకులు, కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, వైస్ సర్పంచ్‌లు, సింగిల్‌విండో అధ్యక్షులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు భారీ ఎత్తున తరలిరావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ కోరారు. కార్యక్రమంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా పాల్గొంటారని శంకరనారాయణ తెలిపారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం తగదు





హాజరైన సెక్టార్, రూట్ ఆఫీసర్లు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో అలసత్వం వహించే వారు తగిన మూల్యం చెల్లించుకుంటారని జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు వెళ్లే అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలన్నీ కచ్చితంగా పాటించాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, పీఓలు, ఏపీఓలు సమన్వయంతో ఎన్నికల విధులను నిర్వర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాలను ముందస్తుగా తనిఖీ చేయాలన్నారు. లోటుపాట్లు ఉంటే వెంటనే సరిచేసుకోవాలన్నారు. ఈనెల 24వ తేదీ లోపు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, ఇతరాత్ర వివరాలతో నివేదిక ఇవ్వాలన్నారు. పోలింగ్ సామగ్రిని తరలించేందుకు మార్చి 12వ తేదీలోపు వాహనాలను సిద్ధం చేసుకోవాలన్నారు. మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, పలువురు సెక్టార్, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

20 నామినేషన్లు దాఖలు

అనంతపురం అర్బన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నాలుగో రోజు మంగళవారం 20 మంది అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ వద్ద నామినేషన్లు దాఖలు చేశారు. పట్టభద్రుల నియోజకవర్గ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా రాఘవేంద్ర, ఆల్‌ఇండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థిగా ఎస్.మల్లికార్జున, భారతీయ పంచాయత్ అభ్యర్థిగా మల్లేష్ యాదవ్ (2వసెట్) నామినేషన్ వేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా కోనేటి హరి వెంకటరమణ, వెన్నపూస భరత్‌రెడ్డి, కాంతి జాన్‌వెస్లీ, జి.మారుతి, నల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, సాబోలు జయకాంత్, పెనుకొండ రవికుమార్, రామచంద్ర, రాజన్న, అశ్వర్థరెడ్డి, కుళ్లాయప్ప, గైబువలి, బోరంపల్లి ఆంజనేయులు, నరసింహమూర్తి (2వ సెట్), ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా కత్తినరసింహారెడ్డి (2వసెట్), మిట్ట వెంకటగారి శ్రీదేవి, రామశేషయ్య నామినేషన్ వేశారు.

1, 2 తేదీల్లో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు వచ్చే నెల 1, 2 తేదీల్లో నిర్వహించనున్నట్లు సీఈఓ భాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ, అదనపు సమావేశ భవనాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, స్థాయీ సంఘాల చైర్‌పర్సన్ల అధ్యక్షతన జరగనున్నట్లు వివరించారు. తొలి రోజు స్థాయీ సంఘం-1, 3, 7 (ఆర్థిక, ప్రణాళిక/వ్యవసాయం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మలి రోజు స్థాయీ సంఘం-2, 4, 5, 6 (గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్య/సాంఘిక సంక్షేమం/స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు) సమావేశాలు కొనసాగుతాయని వెల్లడించారు. ఆయా శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశాలకు హాజరు కావాలని కోరారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులకు సమాచారం చేరవేసినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

మహిళకు హెచ్‌ఎం వేధింపులు

● పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

అమరాపురం: మండలంలోని కె.శివరం పంచాయతీ పరిధిలోని కె.గొల్లహట్టి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజినాయక్ లైంగికంగా వేధిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన ఓ మహిళ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన మేరకు.. బాధితురాలి పిల్లలు పాఠశాలలో చదువుతున్నారు. పిల్లలకు జగనన్న కిట్ ఇస్తామని చెప్పి ఇటీవల ఆమెను పాఠశాలకు హెచ్‌ఎం రప్పించుకున్నాడు. సంతకం చేయించుకుని పంపించాడు. మరుసటి రోజు పాఠశాలలో ఎవరూ లేని సమయంలో కబురు పంపగా ఆమె వచ్చింది. ఈ క్రమంలోనే కిట్ ఇస్తానని ఓ రూంలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఎలాగోలా ఆమె తప్పించుకువచ్చింది. సదరు ఉపాధ్యాయుడి తీరు మాత్రం మారలేదు. ఆ తర్వాత కూడా బెదిరించడం, లైంగికంగా వేధించడం చేస్తున్నాడు. దీంతో బాధితురాలు మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. కాగా, ఈ విషయమై మండల విద్యాశాఖాధికారిని వివరణ కోరగా, సదరు ప్రధానోపాధ్యాయుడిని వేరే గ్రామానికి డిప్యూటేషన్ వేస్తానన్నారు. ఆరోపణలపై విచారణ చేయించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

'డ్రాపౌట్స్ విద్యార్థులను కళాశాలల్లో చేర్పించండి'

కొత్తచెరువు: ఇంటర్ చదువుతూ మానేసిన విద్యార్థులను మళ్లీ కళాశాలల్లో చేర్పించేందుకు ప్రిన్సిపాళ్లు చొరవ చూపాలని ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీ వరకూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ప్రిన్సిపాళ్లు సహకరించాలని కోరారు. డ్రాపౌటైన విద్యార్థి వివరాలను తెలుసుకుని కళాశాలలో చేర్పించాలని సూచించారు.

అపురూపం.. ఆనందం

అచ్చుగుద్దినట్టు ఒకే రూపు ఉంటారు. చూసేవారికి ఆశ్చర్యం కలిగిస్తారు. వారు ఇంట్లో ఉన్నా.. బడికెళ్లినా.. బజారుకెళ్లినా.. బంధువులతో తిరుగుతున్నా ప్రత్యేకత చాటుకుంటారు. ఇక ఇద్దరూ ఒకే డ్రెస్ వేసుకుంటే ఒక్కోసారి అమ్మానాన్నలే గుర్తుపట్టలేరు. అచ్చం ఒకలాగే ఉన్నవారిని ఒక్క క్షణమైనా ఆగి చూడాలనిపిస్తుంది. పేర్లు అడగాలనిపిస్తుంది. కవలలు అంటే అంతేమరి. ఏది ఏమైనా కవలలు ఓ అద్భుతం.. విచిత్రం.. నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం. ఈ సందర్భంగా జిల్లాలో పలువురు కవల పిల్లలపై ప్రత్యేక కథనం..

– అనంతపురం కల్చరల్:

కవలలు ఎవరికైనా ఆసక్తికరంగా కనిపిస్తారు. బాగా తెలిసిన వారికి కూడా ఎవరెవరో పోల్చుకోవడం కష్టసాధ్యమే. కవలల గురించి తెలియజేసే శాస్త్రాన్ని 'జెమలాలజీ' అంటారు. ఫలదీకరణంలో వచ్చే మార్పుల వల్ల కవలల జననం సంభవిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఒకే రకంగా ఉన్నంత మాత్రాన పోలికలు కానీ, గుణగణాలు గానీ, స్పందనలు కానీ ఒకేలా ఉండవని డాక్టర్ల అభిప్రాయం.

కవలల దినోత్సవ ఆవిర్భావమిలా..

ప్రథమంగా కవలల దినోత్సవాన్ని పోలండ్ దేశస్తులు 1976లో నిర్వహించారు. మోజెస్, విల్‌కాక్స్ అనే కవల సోదరులు తాము నివసిస్తున్న ఊరికి 'ట్విన్స్ బర్గ్' అని పేరుపెట్టుకున్నారు. కవలలనే పెళ్లాడి, మళ్లీ కవలలకే జన్మనిచ్చారు. దురదృష్టమైన విషయమేమంటే ఒకే రకమైన వ్యాధి సోకి ఇద్దరూ ఒకే రోజు మరణించడం. వీరి సంస్మరణార్థం ఏటా ఫిబ్రవరి 22న అంతర్జాతీయ కవలల దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

ఒకేలా ఆటలు

అనంతపురం ఆజాద్ నగర్‌కు చెందిన శివశంకర్, వరలక్ష్మి దంపతులకు హరిణి, హర్ష కవల పిల్లలు. లింగభేదమున్నా ఒకేలా ఆటపాటల్లో ఆలోచనలుంటున్నాయి. ఆహార అలవాట్లు, అభిరుచులూ సేమ్ టూ సేమ్ ఉంటున్నాయని తల్లిదండ్రులు తెలిపారు.



ఇద్దరికీ ఒకటే కొనాల్సిందే..

గుత్తి రూరల్: తాడిపత్రికి చెందిన షేక్.నాజియా, షేక్.బాబా ఫకృద్దీన్‌కు మన్నత్ అఫ్రా, మన్నత్ అఫ్మరా పిల్లలు. ఒకే రూపుతో ఆకట్టుకునే ఈ అక్కాచెల్లెళ్లలో తల్లిదండ్రులు ఒకరి కోసం ఏ వస్తువు కొన్నా మరొకరికీ అదే కొనాల్సిందే. అది కూడా ఒకే డిజైన్‌తో ఉండాల్సిందే. డ్రెస్సులు, ఆభరణాలు, ఆట వస్తువులు ఇలా ఇద్దరికీ ఒకేలా ఉన్నవే కొనాలి. లేకపోతే ఆ రోజు గొడవే. జ్వరం వచ్చినా, జబ్బు చేసినా ఇద్దరికీ ఒకేసారి వస్తుంది. భోజనం, అల్పాహారం ఇద్దరి ప్లేట్లలో ఒకేలా ఉండకపోతే ఏడ్చేస్తారు. పాఠశాలకు ఒకరు డుమ్మా కొడితే మరో అమ్మాయి కూడా పోనని మారం చేస్తుంది. పాఠశాలలో ఉపాధ్యాయులతో పాటుగా తాము కూడా ఇద్దరినీ గుర్తు పట్టలేమని, ఏ పని చేసినా ఇద్దరూ ఒకేలా చేస్తుండడమే ఇందుకు కారణమని తల్లిదండ్రులు తెలిపారు.



సందర్భం నేడు కవలల దినోత్సవం

అందరూ తికమక



అనంతపురం నగరానికి చెందిన మల్లికార్జున రెడ్డి, రాధ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరి పిల్లలు సాయి సహస్ర, సాయి సమన్వి ఒకేలా ఉండడమే కాకుండా ఒకేలా అభిరుచులు, ఇష్టాలతో అందరినీ తికమక పెట్టేస్తుంటారు. సంగీతం, చదువులోనూ ప్రతిభ చాటుతున్నారు.

నవ్వుతో ఆకర్షించేస్తారు..



అనంతపురానికి చెందిన షేక్షావలి, రేష్మాభాను దంపతుల పిల్లలు సనా అంజుమ్, సాదియా అంజుమ్. ఇద్దరూ ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్నారు. దాదాపు ఒకే పోలికల్లో ఉండే వీరిని బయటవారు పోల్చుకోవడం కొంతకష్టంగా ఉంటుంది. ఇద్దరి నవ్వు అందరినీ ఇట్టే ఆకర్షిస్తోందని తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

వేర్వేరు స్వభావాలు



కవల అన్నదమ్ములు అజ్మల్, అక్మల్ అనంతపురం శ్రీనివాసనగర్‌లో ఉంటున్నారు. మెహబూబా, అబ్దుల్ సమీ సంతానమైన వీరు ప్రసాద్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నారు. చిన్నప్పుడు చాలానే పోలికలున్నా.. పోనుపోనూ చాలా మారిపోయారు. దీంతో కనుక్కోవడం వీరిని ఈజీనే. అయితే, అభిరుచుల్లో మాత్రం తేడా ఉందని, చదువులో ఒకరు చురుకుగా ఉంటే, ఆటల్లో మరొకరు ఆసక్తి చూపిస్తున్నట్లు కుటుంబసభ్యులు చెప్పారు.

పోటీ తత్వమెక్కువ



అనంతపురం నగరానికి చెందిన ఫకృన్నీసా, జిలాన్ బాషా దంపతులకు 2015లో ఒకేసారి కవల పిల్లలు బుష్రా, జీక్రా జన్మించారు. దీంతో తల్లిదండ్రుల ఆనందాలకు అవధుల్లేవువు. పెరుగుతున్న కొద్దీ వీరికి ప్రతిదాంట్లో పోటీ ఎక్కువగా ఉంటోంది. చూడడానికి సన్నగా ఉన్నా వారి ఉత్సాహాన్ని చూసి ఉపాధ్యాయులే ముచ్చటపడుతుంటారు.

స్థల విక్రయం పేరిట రూ. కోటికి కుచ్చుటోపీ

హిందూపురం: విలువైన స్థలాన్ని విక్రయిస్తానని నమ్మబలికి రూ.కోటి తీసుకున్న వ్యక్తి ఆ తర్వాత మొహం చాటేసిన ఘటన హిందూపురం టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మేడాపురానికి చెందిన బొగ్గు శ్రీరాములు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. టీచర్‌కాలనీలో 16 సెంట్ల విలువైన స్థలం తన పేరిట ఉందని, దాన్ని విక్రయిస్తానని హర్ష అండ్ ఫ్యామిలీ నుంచి రూ. కోటి తీసుకున్నాడు. ఏడాదిగా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నాడు. విసిగిపోయిన హర్ష స్థలం గురించి విచారించగా, యశోదమ్మ పేరిట ఉందని తెలిసింది. దీంతో మోసపోయామని గుర్తించిన బాధితులు మంగళవారం సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. కాగా, కొందరు పోలీసులు నిందితుడిని తప్పించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని సమాచారం.

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం

మడకశిరరూరల్: మండలంలోని జాడ్రపల్లి, కొడిగానిపల్లి, కదిరేపల్లిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు సాగు చేసిన వివిధ పంటలను మంగళవారం నెదర్లాండ్ దేశానికి చెందిన జోరీస్ హాలెమ్యాన్ పరిశీలించారు. ఈ పద్ధతిలో మంచి లాభాలు పొందుతున్నట్లు రైతులు తెలిపారు. 20 రోజులు నియోజకవర్గంలో అధ్యయనం చేయనున్నట్లు జోరీస్ హాలెమ్యాన్ చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జ్ రమేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

హిందూపురం: హిందూపురంలోని శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన పిల్లలకు త్రుటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం సాయంత్రం స్కూల్ వదలిన తర్వాత పిల్లలను తీసుకెళ్తుండగా బస్సు ట్యాంకు నుంచి డీజిల్ లీకైంది. శ్రీనివాసటాకీస్ రోడ్డు వద్ద ట్యాంకు కూడా పడిపోయింది. అక్కడి వారు కేకలు వేయడంతో డ్రైవర్ వెంటనే బస్సు ఆపి దింపేశాడు. డ్రైవర్, కండక్టర్‌ల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ నిర్వాహకుల తీరుపై మండిపడ్డారు. ఇంజిన్ వేడికి మంటలు వచ్చి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదోనని ఆందోళన చెందారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌కు తరలిరండి

● మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌కు భారీగా తరలిరావాలని ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సానిపల్లి మంగమ్మ, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రారెడ్డి బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 9 గంటలకు అనంతపురంలోని సంగమేశ్వర ఫంక్షన్ హాల్‌కు చేరుకోవాలని పార్టీ శ్రేణులను కోరారు.

పొట్టేళ్ల అపహరణ

బత్తలపల్లి: మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 21 పొట్టేళ్లను చోరీ చేశారు. ఎస్‌ఐ టీపీ శ్రీహర్ష తెలిపిన మేరకు... ఈదుల ముష్టూరుకు చెందిన దర్శి సునీల్ తన పొలంలో కంచె ఏర్పాటు చేసుకుని 60 పొట్టేళ్లు పెంచుతున్నాడు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కంచె తొలగించి 21 పొట్టేళ్లు ఎత్తుకెళ్లారు. మంగళవారం తెల్లవారుజాము గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అర్ధరాత్రి సమయంలో కుక్కలు మొరిగినా, ఏవైనా జంతువులు వచ్చి ఉండవచ్చని భావించి బయటకు రాలేదని వాపోయాడు. పొట్టేళ్ల విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విద్యార్థినికి పాము కాటు



గౌతమిని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నల్లమాడ: మండలంలోని మనకవంకపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గౌతమి అనే 5వ తరగతి విద్యార్థిని పాము కాటుకు గురైంది. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం తోటి విద్యార్థులతో కలసి ఆడుకొంటూ తరగతి గదిలో తలుపుచాటున ఉండగా విద్యార్థిని కుడికాలు తొడపై పాము కాటు వేసినట్లు సమాచారం. పామును చూసిన విద్యార్థులు గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని రచ్చకట్టపై కూర్చొని ఉన్న గ్రామస్తులు హుటాహుటిన అక్కడికి చేరుకొని పాము (జెర్రిపోతు)ను చంపివేశారు. చికిత్స కోసం గౌతమిని 108లో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తండ్రి నాగరాజు, గ్రామ మాజీ సర్పంచ్ ఎస్.రాంమోహన్‌రెడ్డి తెలిపారు.

వేడి నీటిలో పడి చిన్నారికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

పెనుకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రంలోని తోటి చిన్నారులతో కలిసి ఆడుకుంటూ వెళ్లిన ఓ చిన్నారి వేడి నీటిలో పడి గాయపడింది. ఈ సంఘటన కురుబవాండ్లపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...గ్రామానికి చెందిన మురళి మూడేళ్ల కూతురు వెన్నెల స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-1 చదువుకుంటుంది. రోజులాగే మంగళవారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన వెన్నెల విరామ సమయంలో తోటి పిల్లలతో ఆడుకుంటూ వెళ్లి... కోడిగుడ్లను ఉడకబెట్టి పక్కన ఉంచిన నీటి పాత్రలో పడిపోయింది. ఈ ఘటనలో వెన్నెల చర్మం కాలిపోగా, వెంటనే స్పందించిన అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది చిన్నారిని స్థానిక ఏఎన్‌ఎం వద్దకు తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం



మృతి చెందిన యశ్వంత్



వైద్య చికిత్స తీసుకుంటున్న అనసూయ

● కుమారుడి మృతి
● ఆస్పత్రిలో తల్లికి చికిత్సలు
● అమరాపురంలో విషాదం

అమరాపురం: కుటుంబ కలహాలతో విసిగిపోయిన ఓ తల్లి తన కుమారుడితో కలిసి పురుగుల మందు తాగింది. కుమారుడు మృతి చెందగా, ఆమె ఆస్పత్రిలో వైద్య చికిత్సలు తీసుకుంటోంది. స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. ఇందిరమ్మ కాలనీలో పొలంలో నటరాజ్ భార్య అనసూయ, కుమారుడు ప్రశాంత్ (15)తో కలిసి ఉంటున్నారు. అనసూయ, కుమారుడు ప్రశాంత్ (15) మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగారు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మడకశిర ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స ఫలించక ప్రశాంత్ మృతి చెందాడు. అనసూయను మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాలతోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిసింది. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ప్రజోపయోగ పనులు చేపట్టాలి

● కలెక్టర్ బసంత్ కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: మైనింగ్ కంపెనీలు చెల్లించే రాయల్టీలో కొంత సొమ్మును ప్రయోజనపయోగ పనుల కోసం వినియోగించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులు, మైనింగ్ కంపెనీల యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం రాయల్టీలో 10 నుంచి 30 శాతం వరకూ కేటాయించాలన్నారు. మైనింగ్ సంబంధిత కార్యకలాపాలతో ప్రభావితమైన ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రధానంగా తాగునీటి సరఫరా, ఆరోగ్య సంరక్షణ, పారిశుధ్యం, విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా శిశు సంరక్షణ తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వృద్ధులు, వికలాంగుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణకు 60 శాతం నిధులు, మిగిలిన నిధులను రోడ్లు, వంతెనలు, జలమార్గాలు, నీటి పారుదల ప్రాజెక్టులకు వినియోగించాలన్నారు. జిల్లాలో 30 మండలాల్లో క్వారీలు ఉన్నట్లు తెలిపారు. అమరాపురం ఉన్నత పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంటుకు మరమ్మతులు చేసి విద్యార్థులకు మంచినీళ్లు అందించాలని సర్వశిక్ష అభియాన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మైనింగ్ శాఖ అధికారులు డీడీ రాజశేఖర్, బాలసుబ్రమణ్యం, ఆంజనేయులు, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రషీద్, పీఆర్ అధికారి విజయ్‌శేఖర్, చితంబరం తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే చోటే నివాసం ఉండాలి

సంక్షేమ హాస్టళ్ల అధికారులు పని చేసే చోటే నివాసం ఉండాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. జిల్లా వెనుకబడిన తరగతుల వసతి గృహాల నిర్వహణపై మంగళవారం రాత్రి ఆయన సమీక్ష నిర్వహించారు. అంకితభావంతో పనిచేయాలన్నారు. ఆహారం కలుషితం కాకుండా చూడాలన్నారు. మెనూ పాటించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థుల భవిష్యత్తు అధికారులపై ఉందని గుర్తించాలని సూచించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతకు పాటుపడాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ వెల్ఫేర్ అధికారి నిర్మలాజ్యోతి, బీసీ వెల్ఫేర్ అధికారులు గంగాద్రి, నాగేంద్ర, రాజు, రాజకుల్లాయప్ప, సూపరింటెండెట్ హరిత పాల్గొన్నారు.

రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించండి



రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

మడకశిర: రైల్వేలైన్ నిర్మాణానికి భూములిచ్చి సహకరించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ కోరారు. రాయదుర్గం నుంచి మడకశిర మీదుగా తుమకూరుకు ఏర్పాటు చేస్తున్న రైల్వే లైన్‌కు మడకశిర మండలంలోని ఆమిదాలగొంది, చందకచర్ల, మల్లినాయకనపల్లి, మడకశిర తదితర గ్రామాల రైతులు కొంతమంది భూములు ఇవ్వడానికి ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వారితో సమావేశమై చర్చించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైల్వేలైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు. భూములకు సంతృప్తికర స్థాయిలో నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. అనంతరం ఆయన మడకశిర తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజనేయులు, ఆర్‌ఐ చంద్రశేఖర్‌రావు తదితరులు ఉన్నారు.